

గంజాయి పట్టివేత

వాహన తనిఖీల్లో నిషేధిత గంజాయి లభించినట్లు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ తెలిపారు.

- 10లో►



సీటు కోసం సిగపట్లు

సీటు కోసం మహిళలు సిగపట్లు పట్టుకున్న సంఘటన వరంగల్–నర్సంపేట ఆర్టీసీ బస్సులో శుక్రవారం చోటు చేసుకుంది.

- 10లో►

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $30^0/16^0$

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చిల్పూరు వెంకన్న హుండీ ఆదాయం రూ.9.33 లక్షలు



చిల్పూరు: చిల్పూరు శ్రీబుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం హుండీలను లెక్కించగా రూ.9,33,053 ఆదాయం వచ్చినట్లు ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. నాలుగు నెలల 15 రోజులకు సంబంధించి హుండీల లెక్కింపును దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్లగొండ జిల్లా పర్యవేక్షణ అధికారి సుమతి సమక్షంలో సేవాసమితి భక్తులు చేపట్టారు.

అయోధ్య 'అక్షింతల' వితరణ



జనగామ: అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర పూజిత రామమందిర అక్షింతలను శుక్రవారం జిల్లా కేంద్రం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జనగామ మండల పరిధి గ్రామాలకు పంపిణీ చేశారు. డాక్టర్ మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయోధ్య రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ జిల్లా సంయోజక్ మంచాల రవీందర్, సహ సంయోజక్ దొంతుల శేఖర్, వరంగల్ సహ కార్యావహ బాలసిద్ధయ్య, గుగ్గిల్ల మహేష్, ధర్మజాగరణ జివిలికపల్లి సత్యనారాయణ, వీహెచ్‌పీ బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు సోమనాథ కళాపీఠం పురస్కారాల ప్రదానం

పాలకుర్తి: స్థానిక సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 2021–22 ద్వైవార్షిక విజేతలుగా ఎంపికైన వారికి ఈ నెల 31న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పీఠం అధ్యక్షుడు రాపోలు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీ సోమేశ్వరాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ జయరాంరెడ్డి హాజరవుతున్నారని చెప్పారు.

పోరాడితేనే హక్కులు..



స్టేషన్‌ఘన్‌పూర్ : పోరాడితేనే హక్కులు సాధించుకోగలుగుతామని బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బర్కం రాంమోహన్ అధ్యక్షతన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు విద్యా, ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. అవకాశాలు రాని మహిళలు వివిధ రకాలుగా నిరసనలు తెలుపడంతో పాటు పాలకులకు వినతులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానానికి కూరాకుల భారతికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సింగారం రవి, దొడ్డిపాటి శేఖర్, రమేష్, రాజు, చందు పాల్గొన్నారు.

గురితప్పిన గులేరు..



జనగామ రూరల్: గులేరు గురితప్పి వందే భారత్ రైలుకు రాయి తగిలిన ఘటనలో జనగామ పట్టణం అంబేడ్కర్ నగర్‌కు చెందిన సజ్జ హరిబాబుపై కేసు నమోదైంది. హరిబాబు రోజుమాదిరిగా శుక్రవారం మధ్యాహ్నం గులేరుతో పిట్టలను కొడుతుండగా గురితప్పి కాజీపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వందే భారత్ రైలుకు తగలింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీ కానిస్టేబుల్ నరేష్ తెలిపారు.

53 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కేయూ క్యాంపస్: డిగ్రీ కోర్సుల పరీక్షల్లో కేయూ పరిధి వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. శుక్రవారం 53 మంది విద్యార్థులు పట్టుబడ్డారు. వారిపై మాల్ ప్రాక్టీస్ కింద కేసులు బుక్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు. వరంగల్‌లో ఆరుగురు, ఖమ్మంలో ఇద్దరు, ఆదిలాబాద్‌లో 45 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు చేస్తూ.. పట్టుబడ్డారని, వారిపై మాల్ ప్రాక్టీస్ కింద కేసులు బుక్ అయ్యాయని వివరించారు.

మేడిగడ్డలో.. ఐదు గంటలు

ప్రాజెక్టు వద్ద బిజీబిజీగా గడిపిన మంత్రుల బృందం

- కుంగిన ప్రాంతం పరిశీలన.. అన్నారం బ్యారేజీ సందర్శన
- ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఈఎన్‌సీ
- హాజరైన మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ వద్ద మంత్రుల బృందం ఐదు గంటలపాటు గడిపింది. ప్రాజెక్టు పరిస్థితి.. కుంగడానికి గల కారణాలు తదితర అంశాలపై ఈఎన్‌సీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా మంత్రులు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న రచ్చపై ముందస్తుగా ప్రకటించిన ప్రకారం.. రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రెవెన్యూశాఖ మంత్రి పి.శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బృందం శుక్రవారం మేడిగడ్డకు తరలివచ్చింది. మంత్రులు హైదరాబాద్ నుంచి నేరుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12.14 గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్నారు. వారికి కలెక్టర్ భవేష్ మిశ్రా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అక్కడినుంచి నేరుగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిమిత్తం ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.

రెండున్నర గంటలపాటు 'ప్రజెంటేషన్'

ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై ప్రొజెక్టర్ ద్వారా ఈఎన్‌సీ మురళీధర్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన సమయంనుంచి నీటిని ఎత్తిపోయడం, టీఎంసీల వివరాలు, విద్యుత్ వినియోగం గురించి వివరించారు. అక్టోబర్ 21న భారీ శబ్దంతో 7వ బ్లాక్‌లో 20, 21, 22 పియర్‌లు కుంగిపోవడం వంటి ఘటనలు జరిగిన తీరును స్క్రీన్‌పై చూపించారు. అప్పులు, లాభనష్టాల గురించి తెలిపారు. నీటి వినియోగం, తరలింపు గురించి పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో మూడు పియర్‌లు, మూడు గేట్లు పనిచేయవని, పూర్తిగా పరిశోధన చేసిన తరువాత మిగితావి పనిచేస్తాయా లేదా అని తెలుస్తుందని తెలిపారు. మంత్రుల సందేహాలను ఈఎన్‌సీ నివృత్తి చేశారు. సుమారు రెండున్నర గంటలపాటు ఈ ప్రజెంటేషన్ కొనసాగింది. ప్రజెంటేషన్‌కు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు హాజరయ్యారు.



బ్యారేజీలో నీటి మట్టాన్ని పరిశీలిస్తూ..

మేడిగడ్డ పరిశీలన

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ముగిసిన తరువాత భోజన విరామం తీసుకున్నారు. అనంతరం మంత్రులు వాహనాల్లో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. కాలి నడకన కొంతదూరం వరకు వెళ్లారు. కుంగిన 21 పియర్ ప్రాంతాన్ని పరిశీలించారు. సుమారు అర్ధగంట పాటు పరిశీలించారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. అక్కడి హెలిప్యాడ్‌లో దిగిన తరువాత వాహనాల్లో బ్యారేజీ వద్దకు వెళ్లారు. 38వ పియర్ వద్ద సీపేజీ బుంగలు ఏర్పడ్డ ప్రాంతానికి ఇరిగేషన్ అధికారులతో కాలినడకన వెళ్లి చూశారు. 15నిమిషాల్లో తిరిగి వచ్చారు. తిరిగి సాయంత్రం 5.15 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఈఎన్‌సీ

ఐదు గంటలపాటు బిజీబిజీగా..

మంత్రులు, నాయకులు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద ఐదు గంటలపాటు బిజీబిజీగా గడిపారు. ఎల్‌అండ్‌టీ క్యాంపు ప్రాంతం మీడియా, ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్‌లతో నిండిపోయి కనిపించింది. చాలా రోజుల తరువాత సందడి నెలకొంది. కాగా, మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరి తీర ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్స్ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, జేఎస్ భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా, శశిభూషన్ కాచే, ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు, ఈఈ తిరుపతిరావు, నూనె శ్రీధర్, యాదగిరి, ఓంకార్ సింగ్, సర్పంచ్ విలాస్‌రావు, ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు ఏమన్నారంటే..






మాట్లాడుతున్న మంత్రులు శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన వాస్తవిక అంశాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించి.. ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాళేశ్వరాన్ని ప్రపంచ స్థాయిలో గొప్ప ప్రాజెక్టు అని అన్న అప్పటి సీఎం, మంత్రులు కుంగిన తరువాత నోరు మెదపలేదన్నారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులోని సాంకేతిక లోపాలను బయటపెట్టి బాధ్యులపైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టుతో భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలకు చుక్క నీరు రాదని తెలిపారు. మంథని, మంచిర్యాల జిల్లా చెన్నూర్ రైతులను ముంపునుంచి ఆదుకోవాలని చెప్పారు. ముంపు జరిగే ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణం చేస్తే నష్ట నివారణ జరుగుతుందన్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి ఉంటే తెలంగాణకు గ్రావిటీ ద్వారా సాగునీరు వచ్చి లాభం జరిగేదన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు.

కేఎంసీలో పారామెడికల్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో వివిధ పారామెడికల్ కోర్సుల్లో 2023–24 సంవత్సర ప్రవేశానికి రెండో రోజు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. 28, 29 తేదీల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 266 సీట్లకు గాను 176 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. మిగిలిన 90 సీట్లకు మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ తేదీలు ప్రకటిస్తామని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో 'నూతన' వేడుకలు చేసుకోవాలి

వరంగల్ క్రైం: ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని సూచించారు. డిసెంబర్ 31న రాత్రి పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వేడుకల్ని అర్ధరాత్రి 12.30 గంటల్లోపు ముగించాలని, ఈనూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానాతోపాటు జైలు శిక్ష విధించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు జరిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే 87126 85257 నంబర్‌కు సమాచారం అందించాలని సీపీ కోరారు.

మల్లన్న జాతరపై రేపు సమావేశం

ఐనవోలు: సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరగనున్న ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి జాతరకు సంబంధించి 16 శాఖల జిల్లా అధికారులతో ఈ నెల 31న ఐనవోలు ఆలయ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విక్రమ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

- రెండోరోజు 18,207 అప్లికేషన్లు
- సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న కుటుంబాలు
- 'ప్రజాపాలన' శిబిరాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి వాకాటి కరుణ



స్టేషన్‌ఘన్‌పూర్‌లో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న వాకాటి కరుణ

జనగామ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న 'ఆరు గ్యారంటీ' పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు చేపట్టిన 'ప్రజాపాలన' శిబిరాలకు అప్లికేషన్లు వెల్లువెత్తుతున్నాయి. మొదటి రోజు 10,502 దరఖాస్తులు రాగా.. రెండవ రోజు శుక్రవారం 18,207 అప్లికేషన్లు వచ్చాయి. కలెక్టర్ శివలింగయ్య పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్ ఆధ్వర్యాన ఆర్డీఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు వినోద్‌కుమార్, ఇస్మాయిల్, రోజారాణి, కొర్నేలియస్, రాము, కేఆర్.లత, చంద్రశేఖర్, రవీందర్, తహసీల్దార్లు, ఎంపీడీఓల నేతృత్వంలో అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శిబిరాల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో శుక్రవారం మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
రఘునాథపల్లి	2,753
చిల్పూరు	1,656
స్టేషన్‌ఘన్‌పూర్	2,108
లింగాలఘణపురం	1,362
జఫర్‌గఢ్	833
పాలకుర్తి	1,134
దేవరుప్పుల	1,078
కొడకండ్ల	352
జనగామ	1,403
బచ్చన్నపేట	1,548
తరిగొప్పుల	954
నర్మెట	993
జనగామఅర్బన్ (4,8,9,13 వార్డులు)	2,033
మొత్తం	18,207

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి: ప్రజాపాలన ప్రత్యేక అధికారి వాకాటి కరుణ

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్, 'ప్రజాపాలన' ప్రత్యేక అధికారి వాకాటి కరుణ అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం కలెక్టరేట్‌కు చేరుకోగా.. కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. 'ఆరు గ్యారంటీ' పథకాల దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై కలెక్టర్‌తో ఆమె మాట్లాడారు. అనంతరం రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి, స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు వచ్చిన మహిళలతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం ఈ కార్యక్రమం చేపట్టిందని, దరఖాస్తుల స్వీకరణ, సందేహాలు, సలహాలు, సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్‌రూం 87162 93880 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఆర్‌డీఓ రామ్మూర్తి, డీసీహెచ్ఎస్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, డీపీఓ వినోద్‌కుమార్ తదితరులున్నారు.

నిరుపేదలకు భూములు పంచాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేష్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: నిరుపేదలకు ఇంటి స్థలం, సాగు భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ అన్నారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మండల గట్టుమల్లు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం ఏఓ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిల్పూరు మండలం శ్రీపతిపల్లిలోని 70 సర్వే నంబర్‌లో 41 ఎకరాల 21 గుంట ప్రభుత్వ పంచరాయి భూమి ఉందని, దీనిని భూమి లేని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులు పోరాడి తెచ్చుకున్న ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని మోదీ సర్కారు కుట్ర చేస్తోందని, ఉపాధి హామీ రక్షణకు పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, పాతూరి సుగుణమ్మ, సముద్రాల రాజు, ఆశీర్వాదం, లక్ష్మి, సత్యవతి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పట్టింపేది..?

నాలుగేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి శూన్యం

- అస్తవ్యస్తంగా శానిటేషన్ పనుల నిర్వహణ
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం
- వాడీవేడిగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం



మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వివిధ వార్డుల కౌన్సిలర్లు

జనగామ: 'శానిటేషన్ పనుల నిర్వహణ సక్రమంగా లేదు.. సిబ్బంది కొరత ఉంది.. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది.. అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.. తడి, పొడిచెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ'.. సభ్యులు ధ్వజమెత్తారు. శుక్రవారం చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై మాట్లాడే సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బ్లీచింగ్ పౌడర్ పేరిట నిధులు వెచ్చిస్తున్నా ఉపయోగం లేదని, కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గాదెపాక రాంచందర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన తర్వాత కూడా సమావేశానికి మీడియాను ఎందుకు ఆహ్వానించలేదని కమిషనర్‌పై మండిపడ్డారు. ఆర్టీసీ చౌరస్తా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కానిస్టేబుల్ పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ.. జనగామ పట్టణం ప్రస్తుతం 2005లో మాదిరిగానే ఉందని, పెరిగిన జనాభా, పట్టణ విస్తరణకు అనుగుణంగా శానిటేషన్ పనుల నిర్వహణ లేదన్నారు. 17వ వార్డులో విద్యుత్ స్తంభాలు కావాలని 48 సమావేశాల్లో మొరపెట్టుకున్నా పరిష్కారం కాలేదని కౌన్సిలర్ జక్కుల అనితవేణుమాధవ్ అన్నారు. నాసిరకం పనులు, చెత్త పాలనతో ప్రజలకు ముఖం చూపించలేక పోతున్నామని సభ్యురాలు వంగాల కల్యాణిమల్లారెడ్డి అన్నారు. కమర్షియల్ వార్డులో శానిటేషన్ సమస్య తీవ్రమవుతున్నా పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ బండ పద్మయాదగిరిరెడ్డి అన్నారు. పట్టణంలో వాటర్ ప్లాంట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, ప్రజలకు మున్సిపల్ వాటర్ అదేలా చూడాలన్నారు. వీవర్స్‌కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభించాలని సభ్యురాలు గుర్రం భూలక్ష్మినాగరాజు కోరారు. రాజకీయాలను పక్కన బెట్టి ఎమ్మెల్యేను అభివృద్ధికి నిధులు కోరాలని బీజేపీ ఫ్లోర్‌లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి అన్నారు. కుక్కలు, కోతులు పిల్లలపై దాడులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని సభ్యురాలు మంత్రి సుమలతశ్రీశైలం ఆవేదన వ్యక్తం చేశారు. కాగా నాలుగు ఎజెండా అంశాలు, రెండు టేబుల్ ప్రతిపాదనలపై పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. అంతకు ముందు అన్ని పార్టీల సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్ కుమార్, ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రమౌళి, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మేనేజర్ రాములు, ఏఈ మహిపాల్ పాల్గొన్నారు.



ఎజెండా అంశాలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

అభివృద్ధి కోసం పోటీపడాలి : ఎమ్మెల్యే

ఎన్నికల వరకే రాజకీయలు.. ఇక నుంచి అభివృద్ధి కోసం పోటీ పడాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం పట్టణ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిందనీ.. స్వచ్ఛత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో దేశం గర్వించేలా కేంద్రం నుంచి 18 అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. జనాభా, ఇంటి నిర్మాణాల పెరుగుదలతో సమస్యలు ఉంటాయని, వాటిని పరిష్కరించుకుంటామని చెప్పారు. శాంతియుత, స్వచ్ఛ జనగామగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని, ఫిల్టర్ బెడ్ ద్వారా సరఫరా చేసే నీటిని ప్రతి ఒక్కరూ వాడుకునేలా ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. సంక్రాంతి తర్వాత కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పట్టణంలోని సమస్యలు, అభివృద్ధి, నిధుల మంజూరుపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెరిగేలా చూడడంతో పాటు కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశానికి ముందు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేత మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రమౌళి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టం

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఏటా పాస్టర్లకు సొంత ఖర్చుతో దుస్తులు పంపిణీ చేసే భాగ్యం కలగడం అదృష్టమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. 15 ఏళ్లుగా క్రమం తప్పకుండా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, సర్వల నర్సింగరావు, వంగాల మల్లారెడ్డి, బనుక శివరాజ్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి కురుమలకే ఇవ్వాలి

జనగామ రూరల్: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థాన చైర్మన్‌తోపాటు డైరెక్టర్ పదవులు కురుమలకే కేటాయించాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీలోనూ నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అలేటి సిద్దిరాములు, సహాయ కార్యదర్శి నోముల సోమయ్య, మంగ సత్యం, సిద్దులు, సంపత్, మేకల క్రాంతి, శివ తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న కొమ్మూరి

క్లుప్తంగా

బాలికపై లైంగిక వేధింపులు

● నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా

వరంగల్ లీగల్: ఒంటరిగా ఇంట్లో ఉన్న 4వ తరగతి చదువుతున్న 8 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపుల గురి చేసిన నేరం రుజువు కావడంతో హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన నేరస్తుడు మేకల రమేష్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000ల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి. అపర్ణ దేవి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రం అంబేద్కర్‌నగర్‌కు చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో 8 ఏళ్ల చిన్న కుమార్తె 4వ తరగతి హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా 2020 జనవరి 30న పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉంది. తల్లిదండ్రులు కూలి పని నిమిత్తం వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక వద్దకు సమీప బంధువైన మేకల రమేష్(40) వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సాయంత్రం ఇంటి చేరిన తల్లిదండ్రులకు బాలిక తెలిపింది. మరుసటి రోజు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చారు. విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో నేరస్తుడు మేకల రమేష్‌కు 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1,000ల జరిమానా, బాధితురాలికి రూ.50వేల పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించారు. కేసును పోలీస్ అధికారులు టి. గోపి, ఎల్.పవన్‌కుమార్ పరిశోధించారు. లైజన్ ఆఫీసర్ ఎం.వెంకటస్వామి, భరోసా కేంద్రం న్యాయవాది నీరజ పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు వీ.రవీందర్, రవి సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● 12 మందికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

వర్ధన్నపేట: మిరపకాయలు ఏరడానికి ఓ ఆటోలో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో 12 మంది కూలీలకు గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని వర్ధన్నపేట శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లంద గ్రామానికి చెందిన 17 మంది వ్యవసాయ కూలీలు అంబేడ్కర్ నగర్ వద్ద మిరప తోటలో మిరప కాయలు సేకరించడానికి కూలీలుగా ఆటో మాట్లాడుకుని ప్రయాణిస్తుండగా అంబేడ్కర్‌నగర్ గ్రామానికి సమీపంలో మూలమలుపు వద్ద ఆటోను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలు రోడ్డుపై పడి హాహాకారాలు చేశారు. అదే సమయంలో అంబేడ్కర్‌నగర్‌కు ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగరాజు పోలీసుల సహాయంతో క్షతగాత్రులను 108లో వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. మౌనిక, రజిత, మంజులకు తీవ్ర గాయాలు కాగా వారిని ఎంజీఎంకు తరలించారు.

కొనసాగిన పరిశోధన పత్రాల సమర్పణ



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు



మాట్లాడుతున్న ఆచార్యుడు

రెండో రోజు చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్న చరిత్రకారులు

● కేయూలో ప్రతినిధుల సందడి

● నేడు ముగియనున్న ఐహెచ్‌సీ సెషన్



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు సుధాకర్



పరిశోధన పత్రాలు సమర్పించేందుకు వచ్చిన అంధ ప్రతినిధులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) 82వ సెషన్‌లో భాగంగా రెండో రోజు క్యాంపస్ ఆడిటోరియం వద్ద పరిశోధన పత్రాల సమర్పన కొనసాగింది. శుక్రవారం ఆడిటోరియంలోని వివిధ కార్యాలయ గదుల్లో మూడు సమాంతర సెషన్‌లలో ప్రతినిధులు, పరిశోధకులు, చరిత్రకారులు తమ పరిశోధన పత్రాల సమర్పనతో పాటు చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 1,053 పరిశోధన పత్రాలు రాగా పాల్గొన్న వారు తమ పత్రాలు సమర్పిస్తున్నారు. మొదటి సమాంతర సెషన్‌లో దళిత్ హిస్టరీ పానెల్‌లో ఆచార్య బి.రామచందర్‌రెడ్డి అధ్యక్షతన రూట్స్ ఆఫ్ ఇండియన్ సబల్టర్న్ లేబర్ ట్రాజెక్టరీస్ ఆఫ్ క్యాస్ట్ ఆక్యూపేషనల్ పాటెర్న్స్ అండ్ ది మార్జనలైజ్ అనే అంశంపై ప్రత్యేక ప్యానల్ సెషన్ జరిగింది. ఇందులో మొత్తం 22 మంది పరిశోధకులు వివిధ సామాజిక వర్తమాన పూర్వపు అంశాలపై పత్రాలు సమర్పించారు. న్యూఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం సీనియర్ ఆచార్యులు చిన్నారావు, చిటీబాబు ప్యానలిస్టుగా వ్యవహరించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ దళితులు, దళిత వర్కర్స్‌కు వేతనాలు, పని పరిస్థితులు ఇతర సామాజిక అంశాలపై జరుగుతున్న వివక్ష, వారి హక్కుల కోసం ఆయన చేసిన కృషిని వివరించారు.

రెండో సమాంతర సెషన్‌లో..

రెండో సమాంతర సెషన్‌లో అలీఘర్ హిస్టోరియన్ సొసైటీ ఆధ్వర్యంలో రిస్ట్రక్చరింగ్ ఇండియన్ ఎకనామిక్ థీయరీ అనే అంశంపై జరిగిన సెషన్‌లో 10కిపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. ఆచార్య ఇర్ఫాన్ హబీబ్, ఆచార్య పట్నాయక్ భారత ఉపఖండం పురాతన కాలం నాటి సమకాలీనం వరకు ఆర్థిక పునర్ నిర్మాణ సిద్ధాంతంలో వచ్చిన మార్పులు, గతకాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. ఆచార్య ప్రభాత్ పట్నాయక్, ప్రొఫెసర్ కెఎం శ్రీమాలి, ప్రొఫెసర్ రాజం గురుఖల్, ప్రొఫెసర్ కేశవన్ వెలుతాట్, ప్రొఫెసర్ ఇష్రాట్ ఆలం, ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి పత్రాలు సమర్పించటంతో పాటు చర్చల్లో పాల్గొన్నారు.

మూడో సమాంతర సెషన్‌లో..

కేయూలో ఆడిటోరియంలో నిర్వహించిన మూడో సమాంతర సెషన్‌లో డెక్కన్ పాస్ట్ అండ్ ప్రజెంట్ అనే అంశంపై మొదటిసారిగా ప్రాంతాల వారీగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో అంశం తీసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. డెక్కన్ ప్రాంత సంస్కృతి సంప్రదాయాల్లో వస్తున్న మార్పులపై 12 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు సంజయ్ సుబోధ్, ఆచార్య సయ్యద్ అలీనదీం రిజావి డెక్కన్ ప్రాంత సూఫీ విధానాలు, ఐడియాలు, పురావస్తు రికార్డులు వాస్తు నిర్మాణ, సాంకేతికగా వచ్చిన మార్పులు వివరించారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు సెషన్లు

కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు సెషన్లలో పరిశోధన పత్రాల సమర్పణ కొనసాగింది. 1,063 పరిశోధన పత్రాలు రాగా అందులో యాన్సెంట్, మిడ్యూవల్, మోడర్న్, అదర్ ద్యాన్ కంట్రీ, ఆర్కియాలజీ విభాగాల్లో ప్రతినిధులు పరిశోధన పత్రాలు సమర్పించారు. అలాగే కూనూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ కుందూరు సుధాకర్ కాకతీయుల కాలం నాటి సామాజిక ఆర్థిక సంస్కృతిక అంశాలు వివరిస్తూ పరిశోధన పత్రం సమర్పించారు. పలువురు అంధ ప్రతినిధులు కూడా వారి పరిశోధన పత్రాలు సమర్పించారు. ఐహెచ్‌సీ సెషన్‌కు పరిశోధన పత్రాలు సమర్పించేందుకు వస్తున్న వారికి పాండిచ్చేరికి సంబంధించిన వారు వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ లైఫ్ మెంబర్ షిప్ క్యాంపెయిన్ నిర్వహించారు. సభ్యత్వం తీసుకోవాలని పాండిచ్చేరి ప్రతినిధులు కోరుతున్నారు.

నేడు ముగింపు సభ

కాకతీయ యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరిగే ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ నేడు (శనివారం) ముగియనుంది. సాయంత్రం 4 గంటలకు జరిగే సభకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఐహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ, సెక్రటరీ సయ్యద్ అలీ నదీమ్ రిజావి పాల్గొననున్నట్లు లోకల్ సెక్రటరీ ఆచార్య టి.మనోహర్ తెలిపారు.

చరిత్ర సామాజిక చైతన్యానికి నాంది

● నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులా ముఖర్జీ



విలేకరులతో మాట్లాడుతున్న మృదులాముఖర్జీ, పక్కన ఆదిత్య ముఖర్జీ

చరిత్ర అనేది సామాజిక చైతన్యానికి నాంది, వివిధ సామాజిక శాస్త్రాలను సంకుచిత, పక్షపాత ధోరణితో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు మృదులాముఖర్జీ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కేయూలోని ఆడిటోరియం వద్ద విలేకరులతో మాట్లాడారు. గత చరిత్రను, సామాజిక శాస్త్రాలను చదివితేనే సమాజంలోని అనేక అంశాలు అర్థం చేసుకునే వీలుంటుందన్నారు. పాలకులు కూడా చరిత్రను చదివితే సామాజిక పరంగా మంచి పరిపాలన కొనసాగించగలుగుతారన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు ఎక్కువగా జాబ్ ఓరియంటెడ్ కోర్సులతోపాటు ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల వైపు మొగ్గు చూపుతుండటం, తల్లిదండ్రులు కూడా ఆ దిశగా చదివించేందుకు ఉపక్రమిస్తున్నారని ఇది సరికాదన్నారు. ప్రతీ గ్రామంలో చరిత్ర ఉంటుందని, ఉమ్మడి వరంగల్‌లోని కడవెండి ప్రాంతాన్ని ఒకప్పుడు సందర్శించానని, ఇప్పటికీ ఆ గ్రామం గొప్పతనం చెబుతున్నారన్నారు. చరిత్ర అంటే ఇదే నన్నారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ఆదిత్య ముఖర్జీ మాట్లాడుతూ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) ఏ పార్టీకి సంబంధించినది కాదన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు అణచివేతలపై ఆర్ఎస్ శర్మ పుస్తకం రాయగా దానిని నిషేధించారని ఇది సరికాదన్నారు. వాస్తవికత చరిత్రను ప్రజలకు తెలియజేయటంలో చరిత్రకారుల ముందుకెళ్తున్నారని, అందుకు ఐహెచ్‌సీ కృషి చేస్తుందన్నారు.

కి'లేడీలు'!

● చికెన్ సెంటర్‌లో రూ.50వేల నగదు చోరీ



చికెన్ సెంటర్‌లోని కౌంటర్

జనగామ: చికెన్ కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు లేడీ కిలాడీలు.. వర్కర్లను మాయ చేసి గల్లా పెట్టెలోని నగదును అపహరించుకుపోయిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డులో జరిగింది. షాపు యజమాని రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వెంకటసాయి చికెన్ సెంటర్‌లో కోళ్ల ఖరీదుకు కోసం ఉంచిన రూ.45వేలతో పాటు వ్యాపారానికి సంబంధించి రూ.5 వేలు కలుపుకుని రూ.50వేలను కౌంటర్‌లో ఉంచి తాళం చేశారు. రమేష్ భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా, వర్కర్లు వ్యాపారం చేస్తున్నారు. ఇద్దరు మహిళలు షాపుకు వచ్చి కోళ్ల కాళ్లు కావాలంటూ లోనికి వచ్చారు. వర్కర్లు తమపని చేసుకుంటుండగా లేడీ కిలాడీలు టెక్నిక్‌గా తాళం తీసి అందులోని రూ.50వేలు తీసుకుని ఉడాయించారు. విషయం గమనించిన వర్కర్లు ఇద్దరు మహిళల కోసం గాలించినా దొరక్క పోవడంతో ఓనర్‌కు సమాచారం అందించారు. చోరీ విషయమై పోలీసులను ఆశ్రయించగా, కంట్రోల్ రూం సీసీ పుటేజీలను పరిశీలించారు. అందులో ఇద్దరు మహిళలు డబ్బు చోరీ చేస్తున్న దృశ్యం రికార్డు అయినట్లు రమేష్ తెలిపారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

రైల్వే బ్లాక్‌తో పలు రైళ్ల సర్వీస్‌లు రద్దు



కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధి హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేపట్టిన నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ పనులతో పలు రైళ్ల సర్వీస్‌లను రద్దు చేసినట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట–సిర్పూర్ టౌన్ (17003) వెళ్లే ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) వెళ్లే రామగిరి ప్యాసింజర్, కరీంనగర్–సిర్పూర్ టౌన్ (07765) వెళ్లే ప్యాసింజర్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ (07766) వెళ్లే ప్యాసింజర్‌ను జనవరి 13వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ (12757) వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ (12758) వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను జనవరి 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రభుత్వ మార్పుతో నిర్బంధం తొలగింది

● ట్రాన్స్ కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● టీఎస్ ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో నిర్బంధాలు తొలిగిపోయాయని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్‌ల నుంచి విద్యుత్ ఉద్యోగులు, ప్రధానంగా జేఎల్‌ఎంలు టీఎస్ ఈఈయూ–327లో చేరారు. యూనియన్‌లో చేరిన వారికి టీఎస్ ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ కండువా కప్పి ఆహ్వానించి, మాట్లాడారు. రక్షణకు అవసరమైన మెటీరియల్ అందించాలని, రెగ్యులర్ ఇంక్రిమెంట్లు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఈఈయూ–327 టీఎస్ ఎన్పీ డీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు తులసి శ్రీమతి, నీలం ఐలేష్, మచ్చిక బుచ్చయ్య గౌడ్, డీ.సదయ్య, ఓదేలు, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



టీఎస్ ఈఈయూ–327లో చేరినవారితో ఇనుగాల శ్రీధర్

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ఆర్‌సీఓ విద్యారాణి

నయీంనగర్: ఉమ్మడి గురుకుల విద్యాలయాల్లో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ ఆర్‌సీఓ విద్యారాణి తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌సీఓ మాట్లాడుతూ ఉమ్మడి ప్రవేశ పరీక్ష 2024 ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్ణయించబడిన జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో జనవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీసెట్. జీఓవీ.ఇన్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సీఓలు సమ్మయ్య, ఉమామహేశ్వరి, భిక్షపతి, జె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

● 14 మందిపై కేసు



అరెస్ట్ చూపుతున్న సీఐ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు

వాజేడు: వాహన తనిఖీల్లో నిషేధిత గంజాయి దొరికినట్లు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద శుక్రవారం వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. ఆ సమయంలో వెంకటాపురం (కె) వైపు నుంచి కారు, నాలుగు ద్విచక్ర వాహనాలు వస్తుండటంతో పోలీసులు వాటిని ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీలో తనిఖీ చేయగా బ్రౌన్ కలర్‌లో ఉన్న ప్యాకెట్‌లో 3.720 కేజీల గంజాయి లభ్యమైంది. వెంటనే కారులో ఉన్న ఐదుగురితో పాటు రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదురుగు పరారయ్యారు. అయితే డిసెంబర్ 31ను సెలబ్రేట్ చేసుకోవడానికి ఒడిసాలోని కలిమెలకు వెళ్లి గంజాయి కొనుక్కొని వస్తున్నట్లు బాధితులు తెలిపారు. పట్టుబడిన వారిలో తాడ్వాయి మండలం మేడారానికి చెందిన చిడెం సిద్ధార్థ, గండికోట అఖిల్, కొత్తూరుకు చెందిన గజ్జెల మధుకర్, కర్రెంగుల మధుకర్, పందెల్ల సాయి, కన్నెపల్లికి చెందిన పాయం సుధీర్, వాజేడు మండలం కొప్పుసూరు గ్రామానికి చెందిన వై.సాకేత్‌లతో పాటు మరో ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన చెరుకూరు సందీప్, వాజేడు మండలం గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన బోదెబోయిన వినయ్, ఇప్పగూడెం గ్రామానికి చెందిన కారం పవన్, అరుణాచల పురం గ్రామానికి చెందిన మడకం పృథ్వీ, మొరుమూరు కాలనీకి చెందిన మడకం పవన్‌లు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.3 లక్షల విలువ చేసే కారు, రూ.50 వేల విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలు, రూ.93 వేల విలువ చేసే గంజాయి, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చింత నెక్కొండలో..

పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి వద్ద రూ.3లక్షల విలువైన 12 కిలోల ఎండు గంజాయిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పర్వతగిరి పోలీసులు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం చింతనెక్కొండ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర వాషిం జిల్లా తరాల మంగ్రుల్పిర్ గ్రామానికి చెందిన శంకర్ అశోక్ పవార్‌ను గ్రామంలో అనుమానంగా కనిపించడంతో తనిఖీ చేయగా రూ.3లక్షల విలువ చేసే 12 కిలోల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్, పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు, సిబ్బందిపాల్గొన్నారు.

తాత సంవత్సరీకానికి వచ్చి అనంతలోకాలకు..

● స్నానానికి వెళ్లి ఇద్దరు యువకుల మృతి



పవన్ (ఫైల్)



శ్రీకాంత్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మొగుళ్లపల్లి: తాత సంవత్సరీకానికి వచ్చిన ఇద్దరు మనుమళ్లు వాగులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల, పోలీసుల కథనం ప్రకారం.. వేములపల్లి గ్రామానికి చెందిన తాటిపాముల రాజీరు ఏడాది క్రితం చనిపోయాడు. శుక్రవారం సంవత్సరీకం (ఏడాది మాశికం). దీంతో అతని మనుమళ్లు తాటిపాముల పవన్(25), సిరిమల్లె శ్రీకాంత్ (17) (బావ బామ్మర్దులు)లు వేములపల్లికి వచ్చారు. గ్రామంలోని పెద్ద వాగులో స్నానానికి ఇద్దరు వెళ్లారు. వాగులో భారీ గుంతలు ఉండడం.. లోతు తెలియక దిగిన వారు ఈత రాకపోవడంతో మునిగిపోయారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు.. స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు. చిట్యాల సీఐ వేణు చందర్, ఎస్సై జాడి శ్రీధర్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. తాత సంవత్సరీకానికి వచ్చి ఇద్దరు మనుమళ్లు వాగులో పడి చనిపోవడంతో వారి తల్లిదండ్రుల రోదనలతో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

వీడని చిక్కుముడి..

● విజయ హత్య కేసులో లభించని ఆధారాలు

● నిందితుల కోసం శ్రమిస్తున్న పోలీసులు



కన్నె విజయ (ఫైల్)

కాజీపేట: కాజీపేట పట్టణంలోని రహమత్‌నగర్ కాలనీలో 15 రోజుల క్రితం అదృశ్యమై దారుణంగా హత్య గావించబడి రహదారిపై శవంగా పడి ఉన్న కన్నె విజయ కేసులో నానాటికి చిక్కుముడులు పెరుగుతున్నాయి. ఆదిలో కేసును సులభంగా పరిష్కరించవచ్చని భావించిన పోలీసులకు గతంలో వచ్చిన దృశ్యం సినిమాను గుర్తుకు తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. భర్త చనిపోవడంతో కుమారుడి వద్ద ఉంటూ చిన్న, చిన్న మొత్తాలను తెలిసిన వాళ్లకు ఇస్తూ ఉండే విజయకు అంతర్గత శత్రువులు అంటూ కాలనీలో ఎవరూ లేరంటున్నారు. మరి అలాంటప్పుడు విజయను హత్య చేసి శరీరానికి అయిన గాయాలతో పాటు రక్తపు మరకలను శుభ్రంగా సబ్బు నీళ్లతో కడిగి మళ్లీ ఇంటి సమీపంలోనే పడేసే ధైర్యం ఎవరు చేసి ఉంటారనే విషయం సందేహాలను రేకెత్తిస్తుంది. కాలనీ సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఎక్కడ కూడా నిందితులు కనిపించకపోవడం, పోలీసులకు చిన్న క్లూ లభించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో కేసును ఛేదించడం క్లిష్టంగా మారింది. ఏసీపీ డేవిడ్ రాజ్‌తో పాటు పోలీసు శాఖలోని పలు శాఖల సిబ్బంది నిందితులను పట్టుకోవడానికి హత్య వెలుగు చూసిన రోజు నుంచి మఫ్టీలోనూ ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. కాలనీ వాసులతో పాటు కుటుంబ సభ్యులు, ఇతర అనుమానితులపై నిఘాను పెంచిన పోలీసులు కడు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. అందరినీ వరుసగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించి పంపిస్తున్నారు. ఈ కేసును ఏ విధంగానైన ఛేధించి నిందితులను చట్టం ముందు నిలపాలని పోలీసులు నిరంతరంగా శ్రమిస్తున్నారు. వృద్ధురాలిని అకారణంగా పొట్టన బెట్టుకున్న నిందితులను పట్టుకోవడంలో విజయం సాధించాలని కాలనీవాసులు ఆకాంక్షిస్తున్నారు.

సీటు కోసం సిగపట్లు



ఆర్టీసీ బస్సులో కొట్టుకుంటున్న మహిళలు

● ఆర్టీసీ బస్సులో కొట్టుకున్న మహిళలు

● వరంగల్ నుంచి నర్సంపేట వెళ్తున్న బస్సులో ఘర్షణ

నర్సంపేట రూరల్ : ఆర్టీసీ బస్సులో సీటు కోసం మహిళలు సిగపట్లు పట్టుకున్నారు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తుండడంతో బస్సులన్నీ రద్దీగా ఉంటున్నాయి. వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మొదట ఓ మహిళ సీటు కోసం రుమాలు వేసింది. ఆమెకంటే ముందు ఎక్కిన మరో మహిళ ఆ సీటులో కూర్చుంది. బస్సు నర్సంపేట రూట్‌లో వెళ్తుండగానే ఆ తరువాత ఎక్కిన మొదటి మహిళ నా సీటులో ఎలా కూర్చుంటావంటూ ప్రశ్నించింది. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి జుట్లు పట్టుకుని కొట్టుకున్నారు. ఆ తరువాత మరో మహిళ వచ్చి మా సీట్లో కూర్చున్నావంటూ అడిగింది. వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగి కొట్టుకున్నారు. తోటి ప్రయాణికులు వారిని ఆపారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.